www.nagaranijam.com PRGI/RNI NO: APTEL/2013/54450

# నగరనిజం

www.nagaranijam.com అక్షరనిజం నగరనిజం తెలుగు దిన పత్రిక

NN NEWS నగరనిజం

| సంపుటి : 13 | సంచిక : 248 | ఉమ్మడి రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 27 గురువారం, నవంబర్ 2025 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|
| Volume : 13 | Issue : 248 | Rangareddy | Editor : Yela.Purushotham | 27 Thursday ,November 2025 | Pages : 4 + | Price : 3/- |

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

నగరనిజం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింద నెంబర్ ఫోన్ కి చేయగలరు : ☎8247467562
Email Id : nagaranijam@gmail.com
Website : www.nagaranijam.com

# భారతదేశంలో వేగంగా ఏవియేషన్ రంగం అభివృద్ధి

- ప్రధాని నరేంద్ర మోడీ
- శంషాబాద్ విమానాశ్రయం వద్ద సఫ్రాన్ ఏరో క్రాఫ్ట్ ఎమ్మార్వో సెంటర్ ను వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాని మోడీ
- శంషాబాద్ లో దేశంలోనే తొలి లీప్ ఇంజన్ సర్వీస్ కేంద్రం
- కొన్ని రంగాల్లో 100 శాతం విదేశీ పెట్టుబడి

**కార్యక్రమానికి హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, ఏవియేషన్ మంత్రి రామ్మోహన్ నాయుడు,తెలంగాణ ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జీఎంఆర్ అధినేత గ్రంధి మల్లికార్జున రావు**






**రాజేంద్రనగర్,నవంబర్ 26 (నగరనిజం ప్రతినిధి):** భారతదేశంలో ఏవియేషన్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. మరోవైపు తెలంగాణలోని హైదరాబాద్ ఏవియేషన్ హబ్ గా అవతరిస్తుండడం పట్ల మోడీ ఆనందం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా లోని శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఎమ్మార్వో సెంటర్ లో సఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఎమ్మార్వో సర్వీస్ సెంటర్ ను ఢిల్లీ నుండి వర్చువల్ గా ప్రారంభించారు ప్రధాని నరేంద్ర మోడీ. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు, తెలంగాణ ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, జీఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జునరావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.శంషాబాద్ విమానాశ్రయం వద్ద ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభమైన సఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఎమ్మార్వో సెంటర్ దేశంలోనే తొలి లీప్ ఇంజన్ ఎమ్మార్వో సెంటర్ కావడం విశేషం. ఈ సందర్భంగా ఢిల్లీ నుండి వర్చువల్ గా మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోడీ... భారతదేశంలో ఏవియేషన్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఒకవైపు దేశంలో ఏవియేషన్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుండడం.... తెలంగాణలోని హైదరాబాద్ ఏవియేషన్ హబ్ గా రూపాంతరం చెందుతుండడం శుభ పరిణామం అన్నారు. దేశంలో పెట్టుబడులను ఆకర్షించడానికి ఇప్పటికే అనేక పారిశ్రామిక సంస్కరణలు తీసుకురావడం జరిగిందన్నారు. కొన్ని రంగాల్లో 100 శాతం విదేశీ పెట్టుబడి ఒక



అవకాశం కల్పించామని మోడీ గుర్తు చేశారు. మరోవైపు జీఎస్టీలో సంస్కరణలు తీసుకొచ్చి పన్నుల భారాన్ని తగ్గించడం జరిగిందన్నారు. రక్షణ రంగాన్ని మరింతగా పటిష్టం చేయడానికి భారత్ ఇప్పటికే 1500 రెఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయడం జరిగిందని ప్రధాని నరేంద్ర మోడీ వివరించారు. ఈ తరుణంలో దేశంలోనే తొలిసారిగా సఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఎమ్మార్వో సర్వీస్ సెంటర్ హైదరాబాదులో ఏర్పాటు కావడం పట్ల మోడీ సంతోషం వ్యక్తం చేశారు. సఫ్రాన్ సంస్థకు భారత ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని ప్రధాని హామీ ఇచ్చారు. కాగా విమానయాన రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. ఏవియేషన్ హబ్ గా అవతరిస్తున్న హైదరాబాదులో సఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఎమ్మార్వో సర్వీస్ సెంటర్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలు అందించడానికి మరిన్ని విమానాశ్రయాలను నిర్మించబోతున్నట్లు రామ్మోహన్ నాయుడు ప్రకటించారు.

### ఏవియేషన్ హబ్ గా హైదరాబాద్ - సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ నగరం ఏవియేషన్ హబ్ గా మారుతుండడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. దేశంలోనే తొలిసారిగా ప్రముఖ సప్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఎమ్మార్వో సర్వీస్ సెంటర్ హైదరాబాద్ విమానాశ్రయం వద్ద ఏర్పాటు కావడం పట్ల రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరం ఇప్పటికే ప్రపంచ శ్రేణి నగరంగా అభివృద్ధి చెందుతోందన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.... హైదరాబాద్ కు దీటుగా త్వరలోనే 35 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దబోతున్నట్లు ప్రకటించారు. ఈ తరుణంలో దేశంలోకెల్లా అతిపెద్ద ఇంజన్ మెయింటెనెన్స్ రిపేర్ అండ్ ఓవరాల్ సెంటర్ శంషాబాద్ విమానాశ్రయం వద్ద ఏర్పాటు కావడం శుభసూచకమన్నారు. ఈ నేపథ్యంలో సఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ సంస్థ యాజమాన్యాన్ని అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి.... వారికి తెలంగాణ ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని ప్రకటించారు. మరోవైపు జీఎంఆర్ ఎయిర్ పోర్ట్ ల్యాండ్ డెవలప్మెంట్ సీఈవో అమన్ కపూర్ మాట్లాడుతూ.... జీఎంఆర్ లో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పన ద్వారా విమానయాన రంగం మరియు రక్షణ సామర్థ్యాలను అభివృద్ధి చేయడంలో అపారమైన అనుభవాన్ని గడించినట్లు గర్వంగా ప్రకటించారు. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలను చేరుకోవడానికి కృషి చేస్తున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ నగరం ఏవియేషన్ హబ్ గా అవతరిస్తోంది అనడానికి సఫ్రాన్ పౌర విమాన ఇంజన్ ఎమ్మార్వో సర్వీస్ సెంటర్ హైదరాబాదులో ఏర్పాటు కావడం ఇందుకు చక్కని ఉదాహరణ అని అమన్ కపూర్ పేర్కొన్నారు.

## జూబ్లీహిల్స్‌లో నూతన శకం ప్రారంభం

- నవీన్ కుమార్ యాదవ్ ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం
- బండి రమేష్ హాజరు

**ఖైరతాబాద్, నవంబర్ 26 (నగర నిజం ప్రతినిధి):** జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి నూతనంగా శాసనసభ్యుడిగా ఎన్నికైన నవీన్ కుమార్ యాదవ్ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం సచివాలయంలో అత్యంత వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వచ్చి హర్షం వ్యక్తం చేశారు.టీపీసీసీ ఉపాధ్యక్షుడు, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి, కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ నియోజకవర్గ కార్యకర్తలతో కలిసి కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం అనంతరం నవీన్ కుమార్ యాదవ్‌కి శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండాలని సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# సర్పంచ్ నామినేషన్ల పై ఆర్డీవో కీలక సూచనలు

- ఎస్సీ ఎస్టీలకు క్యాస్ట్ సర్టిఫికెట్ తప్పనిసరి
- బీసీ అభ్యర్థులకు క్యాస్ట్ సర్టిఫికెట్ పత్రాలపై

**గెజిటెడ్ సంతకం**




**మహేశ్వరం, నవంబర్ 26, (నగరనిజం) :** సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థులు సమర్పించాల్సిన పత్రాలపై కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి స్పష్టతనిచ్చారు. ఎస్సీ ఎస్టీ వర్గానికి చెందిన అభ్యర్థులు తప్పనిసరిగా ఆధార్ కార్డ్, ఓటర్ ఐడి కార్డ్‌తో పాటు కుల ధ్రువీకరణ పత్రం (క్యాస్ట్ సర్టిఫికెట్)ను సమర్పించాలని తెలిపారు. అదే విధంగా బిసి వర్గానికి చెందిన అభ్యర్థులు ఆధార్ కార్డు, ఓటర్ ఐడితో పాటు నామినేషన్ పత్రాలపై క్యాస్ట్ సర్టిఫికెట్ దగ్గర గెజిటెడ్ అధికారి సంతకం చేయిస్తే సరిపోతుందని ఒకవేళ క్యాస్ట్ సర్టిఫికెట్స్ ఉంటే సమర్పించవచ్చని ఆర్డీవో పేర్కొన్నారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల అర్హత నిర్ధారణ కోసం ఈ పత్రాల సమర్పణను తప్పనిసరిగా పాటించాలని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని ఆర్డీవో సూచించారు. అభ్యర్థులందరూ నిబంధనలు పాటించి, నామినేషన్ ప్రక్రియను సక్రమంగా పూర్తి అధికారులకు సహకరించాలని ఆయన సూచించారు.



# మున్సిపాలిటీలను గ్రేటర్‌లో విలీనం చేస్తే పోరు తప్పదు





- సబితా ఇంద్రారెడ్డి హెచ్చరిక
- గ్రేటర్, ఫ్యూచర్ సిటీ పేర్లతో రంగారెడ్డి జిల్లా ఉనికిని దెబ్బతీస్తున్నారని మండిపడ్డ సబితా ఇంద్రారెడ్డి
- శంషాబాద్ లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన దీక్షా దివస్ సన్నాక సమావేశం
- కార్యకర్తలకు దిశా నిర్దేశం చేసిన మాజీ హెూం మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**రాజేంద్రనగర్,నవంబర్ 26 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను గ్రేటర్ హైదరాబాద్ విలీనం చేయాలనే ప్రభుత్వ నిర్ణయంపై త్వరలోనే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని మాజీ హెూంమంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. ఒకవైపు గ్రేటర్ హైదరాబాద్.... మరోవైపు ఫ్యూచర్ సిటీ లో జిల్లాలోని మున్సిపాలిటీలు కార్పొరేషన్ లోన్ విలీనం చేస్తూ రంగారెడ్డి జిల్లా ఉనికిని ప్రశ్నార్థకం చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం నాడు రంగా రెడ్డి జిల్లా లోని శంషాబాద్ వద్ద బీఆర్ఎస్ జిల్లా కార్యా లయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన దీక్షా దివస్ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ హెూం మంత్రి సబితా ఇంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భ ంగా మాట్లాడిన సబితా ఇంద్రారెడ్డి.... ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల ఉన్న రంగారెడ్డి జిల్లాలోని మున్సిపాలిటీలతో పాటు కార్పొరేషన్లను గ్రేటర్ హైదరాబాదులో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రేటర్ హైదరాబాద్ లో కనీసం చెత్త ఎత్తే దిక్కు లేదని వాపోయారు. రంగారెడ్డి జిల్లాలోని శివారు మున్సిపాలి టీలు, కార్పొరేషన్లను గ్రేటర్ హైదరాబాద్ లో విలీనం చేస్తే కనీసం వీధి దీపాలకు బల్బు వేసే దిక్కు ఉండదని సబితా ఇంద్రారెడ్డి హెచ్చరించారు. విభజించి పాలించు అన్న రీతిలో ఒకవైపు ఫ్యూచర్ సిటీ.... మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ పేరుతో రంగారెడ్డి జిల్లా ఉనికిని దెబ్బతీ యాలని చూస్తున్నారని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలో గతంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రతినెల ప్రత్యేక నిధులను మంజూరు చేసేదని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చి రెండేళ్లు దాటినా మున్సిపాలిటీలకు నయా పైసా విడుదల చేయలేదని సబితా ఇంద్రారెడ్డి మండిప డ్డారు. రంగారెడ్డి జిల్లా ఉనికిని ప్రశ్నార్థకం చేస్తూ జిల్లాకు చెందిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను గ్రేటర్ హైదరాబా దులో విలీనం చేయాలనే నిర్ణయంపై ప్రభుత్వం పునరాలో చన చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలోని శివారు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను గ్రేటర్ హైదరాబాదులో విలీనం చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సబితా ఇంద్రారెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. ఆదిశగా ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డికి ఆమె సూచించారు. మరోవైపు గ్రేటర్ హైదరాబాద్ లో మున్సిపాలిటీల విలీనాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టే ఆందోళనకు పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ' తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి '

- బండరావిరాల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు
- బండరావిరాల పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 26 ( నగరనిజం ) :** క్రమశిక్షణ మరియు స్వీయ నియంత్రణ ఉన్నప్పుడే నేటి విద్యార్థులు రేపటి బాధ్యత గల పౌరులుగా తయారు అవుతారని బండరావిరాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు అన్నారు. బుధవారం అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలోని బండరావిరాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు... విద్యార్థులలో ప్రశ్నించే తత్వం ఉన్నప్పుడే చక్కగా రాణిస్తారని వారు అన్నారు. సమాజంలో గౌరవంగా బ్రతకడానికి చదువు ఎంతగానో ఉపయోగపడుతుందని వారు అన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఈ స్థాయిలో ఉన్నానని గుర్తు చేశారు. చదివిన విషయానికి అర్థం తెలుసుకొని ఆచరించినప్పుడే దానికి విలువ ఉంటుందని వారు తెలిపారు. చరవాణి, టెలివిజన్ లు విద్యార్థుల విలువైన కాలాన్ని వృధా చేస్తాయని వారు అన్నారు. చక్కటి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి సమాజం గర్వించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పిల్లలు ఎల్లప్పుడూ సమాజానికి, పెద్దలకు జవాబుదారీగా ఉండాలని సూచించారు. విద్యార్థుల ఇష్టంగా చదివి తల్లిదండ్రులకు, గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని సూచించారు. స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులుగా, అధికారులుగా చక్కటి ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీసీ చైర్మన్ నందిని, ఉపాధ్యాయులు శ్రీధర్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## శివారు ప్రాంతాల విలీనం ప్రజలకు పెనుభారం

### జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 26 ( నగరనిజం ) :** ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న నగర శివారు ప్రాంత మున్సిపాలిటీలను గ్రేటర్ హైదరాబాద్ లో విలీనం చేయడం పేద, మధ్య తరగతి ప్రజలకు పెనుభారంగా మారుతుందని జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో జిహెచ్ఎంసి లో శివారు ప్రాంతాల విలీనంపై జరిగిన నిర్ణయంపై ఆయన మాట్లాడుతూ... ప్రజల స్థితిగతులపై ఏమాత్రం అవగాహన లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన అన్నారు. శివారు ప్రాంతాల విలీనంపై పునరాలోచన చేయాలని, లేదంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణా రెడ్డి, తదితరులున్నారు.

## ' పట్నం ' ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం




**ఇబ్రహీంపట్నం, నవంబర్ 26 ( నగరనిజం ) :** ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సామాజిక శాస్త్రాల విభాగం మరియు జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.రాధిక మాట్లాడుతూ... ప్రపంచ రాజ్యాంగాలలో కెల్లా భారత రాజ్యాంగం సర్వోత్తమమైనదని, భారత ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి రాజ్యాంగమే ప్రధాన కారణమని గుర్తు చేశారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగం యొక్క ప్రాథమిక సూత్రాలపై కనీస అవగాహన పెంపొందించుకోవాలని, రాజ్యాంగానికి లోబడి ఉత్తమ పౌరులుగా ఉండాలని సూచించారు. ఇంత గొప్ప రాజ్యాంగాన్ని రూపకల్పన చేసిన రాజ్యాంగ పరిషత్ ముఖ్యంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కృషి మరువలేనిదని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులచే రాజ్యాంగ ప్రవేశికను సామూహికంగా పఠనం చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్, ప్రభుత్వ పాలన శాస్త్రవేత్త అధిపతి జీ.రవికుమార్, రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ నీలిమ, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రమేష్, డాక్టర్ రాకేష్ భవాని, డాక్టర్ రచన, అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# లేబర్ కోడ్ల అమలు గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాల్సిందే

- ఎండి జబ్బర్ అవాజ్ సంఘం

### తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు



**కొల్లాపూర్ నవంబర్27 నగరనిజం ప్రతినిధి ఎర్రం నాగేంద్రం)** కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ 29 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేసేందుకు నవంబర్ 21న మినిస్ట్రీ ఆఫ్ లేబర్ అండ్ ఎంప్లాయిమెంట్ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ను వెంటనే రద్దు చేయాలని లేబర్ కోడ్ లను రద్దు చేస్తూ కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం,కె వి పి ఎస్ ఆధ్వర్యంలో పాన్గల్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా దగ్గర నిరసన కార్యక్రమం, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవాజు సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండి జబ్బార్ మాట్లాడుతూ...స్వాతంత్రానికి పూర్వం బ్రిటిష్ పాలనలోనే భారత కార్మిక వర్గం అనేక పోరాటాలు ప్రాణ త్యాగాలు చేసి హక్కులను చట్టాలను సాధించుకున్నది.కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత 29 కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా సవరణలు చేసింది. ప్రజలందరూ కరోనా కష్టకాలంలో ఉన్న పరిస్థితుల్లో దొంగ దారిన పార్లమెంటులో ఆమోదించుకున్నది. చట్టాల్లో కార్మికులకు ఉపయోగపడే అంశాలను నిర్వీర్యం చేసింది. సంఘం పెట్టుకునే హక్కును సమ్మె చేసే హక్కును కనీస వేతనాలు అడిగే హక్కును ఉద్యోగ భద్రతను కార్మిక వర్గానికి దూరం చేసింది. ఈ లేబర్ కోడ్ లు అమలులోకి రాకుండా భారత కార్మిక వర్గం ఐక్యంగా గత ఐదు సంవత్సరాలుగా దేశవ్యాప్త సమరశీల పోరాటాలను నిర్వహిస్తూ వస్తోంది .కేంద్రబీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని లేనిపక్షంలో కార్మిక వర్గం దేశవ్యాప్త ఐక్యపోరాటాలకు సన్నద్ధం అవుతుందని హెచ్చరించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించుతాం, కేంద్ర బీజేపీ ప్రభుత్వం వామపక్ష లను పార్లమెంట్ నుండి బయటకు పంపి అప్రజాస్వామ్యంగా లేబర్ కోడ్ లను ఆమోదించుకుంది. అధికారంలోకి వచ్చిన నాటినుండి కార్మిక కర్షక. రైతు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని అన్నారు. కార్పొరేట్ స్వామి భక్తిని ప్రదర్శిస్తుంది వారికి అనుకూలంగా చట్టాలను మారుస్తుంది దేశ ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కట్టబెడుతుంది సహజ సంపదను వనరులను అడవులను దోచుకునేందుకు అవకాశం ఇస్తుందని అన్నారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువస్తే 11 నెలలు ఢిల్లీ చుట్టుముట్టి పోరాడి వెనక్కి కొట్టిన విషయాన్ని ప్రభుత్వం మరిచిపోవద్దని హెచ్చరించారు. బి జె పి ప్రభుత్వం ప్రజా కార్మిక కర్షక విధానాలను విడనాడకపోతే విశాల ఉద్యమాలను నిర్మిస్తామని ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేంద్రంకెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు గంధం భగత్, సిఐటియు సీనియర్ నాయకులు జి వెంకటయ్య. విద్యుత్ రంగం జిల్లా నాయకులు రామకృష్ణ, సిఐటియు నాయకులు, నిరంజన్, రంగస్వామి, సుగ్రీవుడు. నాగన్న. చందు. బాలకృష్ణ. డివైఎఫ్ఐ నాయకులు కాజా, కెవిపిఎస్ మండల నాయకులు శేఖర్. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కుమార్. తదితరులు పాల్గొన్నారు.



## యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి







- నందివనపర్తి మాజీ సర్పంచ్ డాక్టర్ రాజునాయక్
- నందివనపర్తిలో హెూల్ సేల్ రిటైల్ ఎగ్

### మార్కెట్ ప్రారంభం

**ఇబ్రహీంపట్నం, నవంబర్ 26 ( నగరనిజం ) :** యువత స్వశక్తితో ఎదగాలని, స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని నందివనపర్తి మాజీ సర్పంచ్ వర్త్యవత్ డాక్టర్ రాజునాయక్ అన్నారు. బుధవారం యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన కందికంటి ఆనంద్ గ్రామంలో స్వయం ఉపాధి కోసం నూతనంగా ఏర్పాటు చేసుకున్న హెూల్ సేల్ రిటైల్ ఎగ్ మార్కెట్ ను గ్రామ మాజీ సర్పంచ్ డాక్టర్ రాజునాయక్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధితో వివిధ వ్యాపార రంగాలలో రాణించి, యువతకు ఉపాధి కల్పించే విధంగా ముందుకు సాగాలని వ్యాపార నిర్వాహకులకు సూచించారు. అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. వ్యాపార రంగంలో రాణించేందుకు శ్రమించాలని, దానితో ఉపాధి పొందడంతో పాటు మరో నలుగురికి ఉపాధి చూపించిన వారవుతారని అన్నారు. ప్రతి ఒక్కరూ ప్రణాళిక బద్దంగా ఎదిగి తమ ఆర్థిక స్థిగతులను మెరుగుపరుచుకోవాలని అన్నారు. గ్రామంలో నూతనంగా ఎగ్ మార్కెట్ సెంటర్ ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. సరళమైన ధరలతో నమ్మకంగా మార్కెట్ సెంటర్ ను నడపాలన్నారు. వ్యాపారం మంచి లాభాలతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం షాపు నిర్వహకులు ఆనంద్ ను అభినందించారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ స్వశక్తితో ఎదగాలని, వారికి తమ అండదండలు ఎల్లపుడూ ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులు ఆనంద్ రాజునాయక్ ను, తదితరులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, సీనియర్ నాయకులు వెంకటేష్, బుగ్గరాములు, అంజయ్య, రాకేష్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## కొర్విచేడ్ మల్లన జాతరలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ పైలెట్ రోహిత్ రెడ్డి





**నగర నిజం తాండూర్ ప్రతినిధి నవంబర్ 26:::**బషీరాబాద్ మండలంలోని కొర్విచేడ్ గ్రామంలో నిర్వహించిన మల్లన జాతర ఉత్సవాలలో పాల్గొని తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డిప్రత్యేక పూజలు నిర్వహించారు.అదేవిధంగా బషీరాబాద్ మండల కేంద్రంలో జరిగిన యువకుడు అరుణ్ వివాహం వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను పైలెట్ రోహిత్ రెడ్డి ఆశీర్వదించారు..

నగరనిజం

27 గురువారం, నవంబర్ 2025

# దీక్షా దివస్ ను పండుగలా నిర్వహించాలి

- మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- శంషాబాద్ లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో దీక్షా దివస్ సన్నాహక సమావేశం
- మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో గులాబి శ్రేణులతో సన్నాహక సమావేశం
- ముఖ్యఅతిథిగా హాజరైన సబితా ఇంద్రారెడ్డి







**రాజేంద్రనగర్,నవంబర్26(నగరనిజం ప్రతినిధి):**కేసీఆర్ ప్రాణాలను ఫణంగా పెట్టి రాష్ట్ర సాధన కోసం చేపట్టిన దీక్షా దివస్ ను ఒక పండుగలా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు మాజీ హోం మంత్రి సబితా ఇంద్రారెడ్డి. బుధవారం నాడు రంగారెడ్డి జిల్లా లోని శంషాబాద్ వద్ద బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన దీక్షా దివస్ సన్నాహక సమావేశానికి సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.కేసీఆర్ ప్రాణాలకు తెగించి దీక్ష చేపట్టడం వల్లనే ఆనాటి కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం దిగివచ్చి తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిందని ఆమె గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ కు ప్రత్యేక స్థానం ఉంటుందని చెప్పారు. కేసీఆర్ దీక్ష చేపట్టిన రోజున తాను కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా ఉన్నానని, తాను స్వయంగా కేసీఆర్ దీక్షా స్థలికి వెళ్లి దీక్ష విరమించమని కోరితే ప్రాణం పోయినా దీక్ష విరమించనని కేసీఆర్ తేల్చి చెప్పారని ఆమె గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే అప్పటి ముఖ్యమంత్రికి తాను కూడా కెసిఆర్ ఆరోగ్య పరిస్థితి గూర్చి వివరించడం జరిగిందని, కేసీఆర్ ప్రాణాలకు ఏదైనా ముప్పు జరిగితే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని తాను అప్పటి ముఖ్యమంత్రికి వివరించినట్లు సబితా ఇంద్రారెడ్డి గుర్తుచేసుకున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ చేపట్టిన దీక్షా దివస్ రోజును ఒక పండుగగా నిర్వహించాలని ఆమె పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.దీక్షా దివస్ రోజున ప్రతి కార్యకర్త తమ ఇంటి ముందు గులాబీ జెండాను ఎగరేయాలని, వీధి వీధినా దీక్ష దివస్ కు సంబంధించిన భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తోరణాలు కట్టాలని పిలుపునిచ్చారు. అయితే గ్రామపంచాయతీ ఎన్నికలు ఉన్న గ్రామాల్లో కార్యకర్తలు తమ ఇళ్ళ ముందు గులాబీ జెండాలు ఎగరేసుకోవాలని సూచించారు.

### దీక్షా దివస్ కు వెల్లువలా తరలిరండి - మంచిరెడ్డి కిషన్ రెడ్డి

నవంబర్ 29వ తేదీన శంషాబాద్ లోని పార్టీ జిల్లా కార్యాలయం వద్ద నిర్వహించ తలపెట్టిన దీక్షా దివస్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లాలోని ప్రతి గ్రామంలో కార్యకర్తలు పార్టీ పతాకాలను ఆవిష్కరించి శంషాబాద్ లోని పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలిరావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి, పార్టీ శంషాబాద్ మండల అధ్యక్షుడు మంచర్ల మోహన్ రావు, డిసిసిబి మాజీ డైరెక్టర్ బూకుంట సతీష్, పార్టీ జిల్లా నేతలు పాండు యాదవ్ (నాగారం సహకార బ్యాంకు చైర్మన్), దిద్యాల జయమ్మ శ్రీనివాస్ (శంషాబాద్ మాజీ ఎంపీపీ), దీపా మల్లేష్ ముదిరాజ్,మడుపతి పరమేశ్వరి నరేందర్, సత్యనారాయణ గౌడ్, మహమ్మద్ గౌస్ పాషా, చక్రధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి,చిన్నగండు రాజేందర్, ఆర్కే రమేష్ తదితర పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.





# బీసీలను నట్టేట ముంచిన కాంగ్రెస్

- 42 శాతం రిజర్వేషన్లలతో కొత్త నాటకం
- స్థానిక ఎన్నికల్లో ఓట్ల లబ్ధి కోసమే చీరల పంపిణీ
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయం
- మంచాల మండల బీఆర్ఎస్ అధ్యక్షులు చీరాల రమేష్



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 26 ( నగరనిజం ) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో నాటకమాడి బీసీలను నట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీని స్థానిక ఎన్నికల్లో బొంద పెట్టడం ఖాయం అని మంచాల మండల బీఆర్ఎస్ అధ్యక్షులు చీరాల రమేష్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ... మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గత రెండు సంవత్సరాలుగా చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. గత 76 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తూనే వస్తుందని అన్నారు. అదే క్రమంలో ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో 42 శాతం రిజర్వేషన్లు పేరుతో కొత్త నాటకం ఆడి మరోసారి మోసం చేసిందని అన్నారు. ప్రస్తుతం మంచాల మండలం లో 23 గ్రామ పంచాయతీలో బీసీ కేటగిరీలో రెండు గ్రామాలు కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. అందులో రెండు చిన్న గ్రామాలకు కేటాయించడం మరి విడ్డూరంగా ఉందని అన్నారు. ఇలా రిజర్వేషన్లు కేటాయించడం బీసీలపై చిన్నచూపు చూడటం కాంగ్రెస్ పార్టీ నిదర్శనం అని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సిఎం కేసిఆర్ ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా బతుకమ్మ సంబరాల్లో ప్రతి ఆడపడుచుకి చీరలు పంపిణీ చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఉదయం చీరలు పంపిణీ చేసి సాయంత్రం ఎన్నికల నోటిఫికేషన్ వేయడం ఏమిటని ప్రశ్నించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా 42 శాతం రిజర్వేషన్లు పేరుతో మరోసారి బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని అన్నారు.

# మహానగరంతో పాటు నియోజకవర్గం మరింత అభివృద్ధి

- కందుకూర్ మహేశ్వరం మండలాలకు ఫ్యూచర్ సిటీనే మణిహారం
- నవంబర్ 26, 2008 ,ముంబై దాడుల మృతులకు కేఎల్ఆర్ నివాళులు



**మహేశ్వరం,నవంబర్ 26, (నగరనిజం) :** మహానగరంతో పాటు మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ శాసనసభ్యులు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 27 పురపాలికలను జిహెచ్ఎంసిలో అంతర్భాగం చేయడం వల్ల పట్టణ ప్రణాళిక ద్వారా అభివృద్ధి ఫలాలు అందరికి సమానంగా అందుతాయన్నారు. కందుకూరు మహేశ్వరం మండలాలకు రానున్న రోజుల్లో ఫ్యూచర్ సిటీనే మణిహారంగా మారుతుందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ శివారు మున్సిపాలిటీల విలీనంతో మినీ తెలంగాణగా హైదరాబాద్ మారుతుందన్నారు. త్వరలో డివిజన్ల పునర్విభజన జరిగితే జనాభా ప్రతిపాదికన దామాషా ప్రకారం రిజర్వేషన్ల సీట్ల కేటాయింపు ఉంటుందని కేఎల్ఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో అతిపెద్ద మహానగరంగా గ్రేటర్ హైదరాబాద్ తలమానికంగా మారుతుందన్నారు. 2008 నవంబర్ 26 ముంబై దాడుల్లో అసువులు బాసిన వారి ఆత్మలు శాంతి చేకూరాలని కేఎల్ఆర్ నివాళులర్పించారు.



ఇబ్రహీంపట్నంలోని సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మూడవ, నాలుగవ సంవత్సరం చదివే విద్యార్థిని విద్యార్థులు జాతీయస్థాయి ( ఎన్ పీటీఈఎల్ ) పరీక్షలో మొత్తం 90 మంది ఉత్తీర్ణులు అయ్యారు. అందులో జి.నగేష్ టాప్ 2 శాతం, బి.పవన్ టాప్ 5 శాతం, 23 మంది విద్యార్థులు సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ డాక్టర్ ప్రదీప్ కుమార్, డైరెక్టర్ జి.భగత్, ప్రిన్సిపాల్ పి. శేఖర్ బాబు, హెచ్ఓడి డాక్టర్ ఫరా అంజుమ్, కోఆర్డినేటర్ జి.సాయిరాం వారిని అభినందించారు.

ఇబ్రహీంపట్నం / నగరనిజం

# భారత రాజ్యాంగం వర్ధిల్లాలి : బీఎస్పీ



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 26 ( నగరనిజం ) :** తుర్కయాంజాల్ మునిసిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఇంజాపూర్ వార్డు అధ్యక్షులు మీసాల రవికుమార్ అధ్యక్షతన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ యొక్క చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ బీఎస్పీ అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ మాట్లాడుతూ... భారత దేశంలో భారత రాజ్యాంగం అమలులోకి రాకపోయి ఉంటే 90 శాతం జీవితాలు దుర్భరంగా ఉండేవని గుర్తు చేశారు. ప్రపంచ మేధావి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ప్రపంచ దేశాలన్నీటీని పరిశీలించి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు కష్టపడి రాజ్యాంగాన్ని అందించారని అన్నారు. సమాజంలోని కులమతాల ఆస్తీ అంతస్తులు తేడా లేకుండా విలువైన వజ్రం లాంటి ఓటు హక్కును అందించాడని గుర్తు చేశారు. తద్వారా భారతదేశం ప్రజాస్వామ్య దేశంగా వర్ధిల్లుతుందని అన్నారు. ఓటు విలువను, రాజ్యాంగాన్ని అర్థం చేసుకొని అధికారం వైపు పయనించాలని, అందుకు బీఎస్పీ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు బాబు, ఉపాధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి మల్లెల రఘు, కోశాధికారి రంజిత్ కుమార్, యాదగిరి, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

# 46వ జీవోను రద్దు చేయాలని బీసీ ఉద్యమ నేతల డిమాండ్

- భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎల్బీనగర్‌లో బీసీల నిరసన



**ఎల్‌బీ నగర్, నవంబర్ 26, (నగర నిజం):** భారత రాజ్యాంగం ఉద్దేశించిన సామాజిక న్యాయాన్ని ధిక్కరించే విధంగా బీసీల హక్కులను హరిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని బీసీ ఉద్యమ నేతలు హెచ్చరించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి పిలుపు మేరకు బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎల్‌బీ నగర్‌లో బీసీ నేతలు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద భారత రాజ్యాంగ ప్రతులను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. నేతలు మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్రం, రాష్ట్రం రెండూ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను ఉల్లంఘిస్తూ, ఉద్దేశపూర్వకంగా రిజర్వేషన్లను తగ్గిస్తున్నారని విమర్శించారు. సర్పంచ్ ఎన్నికల్లో బీసీలకు 23 శాతం రిజర్వేషన్లు అమలు చేసే పేరుతో తీసుకొచ్చిన 46వ జీవోను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ బీసీ జేఏసీ అధ్యక్షుడు దుస్స యాదగిరి నేత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యమ నేతలు బొమ్మ రఘురామ్ నేత, చామకూర రాజు, ఎర్ర మాద వెంకన్న, కె వి గౌడ్, విశ్వనాథుల పుష్పగిరి, ఉపేంద్ర యాదవ్, బొల్లంపల్లి ఆంజనేయులు, తడ్క యాదగిరి, సల్వా చారి, కొండల్ గౌడ్, సింగారం శ్రీనివాస్, లింగేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై ఉక్కు పాదం కాప్రా తాసిల్దార్






- బైరెడ్డి రాజేష్

**నగర నిజం, జవహర్ నగర్, నవంబర్ 26:** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ భూములపై అక్రమ నిర్మాణాలు జరగకుండా రెవిన్యూ శాఖ కఠిన చర్యలకు సిద్ధమైంది. కాప్రా తాసిల్దార్ బైరెడ్డి రాజేష్ ఆధ్వర్యంలో ఈరోజు భారీ బందోబస్తుతో కూల్చివేతలు చేపట్టగా జిల్లా కలెక్టర్ అక్రమాలకు ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్ష ఉండదని స్పష్టం చేశాడు. వేరువేరు కాలనీలలో ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తుండగా సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించారు. సర్వే నెంబర్లు 710, 377, 376, 293, 202, 203, 421, 812లో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను ఈరోజు తొలగించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్లు రమేష్, సత్యనారాయణ తాసిల్దార్ బైరెడ్డి రాజేష్ సూచనలతో చర్యలు చేపట్టారు. ఇకపై ప్రభుత్వ భూములను ఆక్రమించే ప్రవర్తన కనిపించిన వెంటనే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలను ప్రజల అవసరాలకు కాపాడటం తమ బాధ్యత అని తెలిపారు.






# వార్డ్ లలో పారిశుద్ధ్య పనుల పై స్పెషల్ ఫోకస్





- ప్రజలతో మమేకమై సమస్య లు అడిగి తెలుసుకున్న కమిషనర్ యాదగిరి

**నగర నిజం తాండూర్ ప్రతినిధి నవంబర్ 26:::** తాండూర్ మున్సిపల్ పరిధిలోని వార్డుల పర్యటనలో భాగంగా బుధవారం కమిషనర్ బి. యాదగిరి పాత తాండూర్ లో పర్యటించారు. ప్రజలతో మమేకమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పనులపై స్పెషల్ ఫోకస్ పెడుతున్నట్టు కమిషనర్ వివరించారు. బసవన్న కట్ట వద్ద కూరగాయ వ్యాపారులు రోడ్డుపై ఎక్కడపడితే అక్కడ వేస్తుండడంతో వారితో మాట్లాడి చెత్తను ఒక చెత్త బుట్టలో వేయాలని సూచించారు. కమిషనర్ వెంట ఏఈ ఉదయ్ కుమార్, శానిటరీ ఇన్స్పెక్టర్లు వెంకటయ్య, ఉమేష్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి వంశీ, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ప్రవీణ్ గౌడ్, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.





నగరనిజం

27 గురువారం, నవంబర్ 2025

# శంషాబాద్‌ను గ్రేటర్‌లో విలీనం చేయడం శుభ పరిణామం

- కాంగ్రెస్ నేత రాచమల్ల సురేష్
- సీఎం రేవంత్ రెడ్డి తో పాటు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కు సురేష్ కృతజ్ఞతలు
- జీవో 111 నుండి శంషాబాద్ కు విముక్తి కల్పించాలని


**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సురేష్ విజ్ఞప్తి**



**రాజేంద్రనగర్,నవంబర్ 26 (నగరనిజం ప్రతినిధి):** రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ మున్సిపాలిటీ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ లో విలీనం చేయడం పట్ల కాంగ్రెస్ సీనియర్ నేత రాచమల్ల సురేష్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సురేష్ కృతజ్ఞతలు చెప్పారు. శంషాబాద్ వద్ద రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుతో ఈ ప్రాంతానికి ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కినప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని సురేష్ వాపోయారు. జీవో 111 నిబంధనల కారణంగా శంషాబాద్ ప్రాంతం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. శంషాబాద్ విమానాశ్రయానికి నిత్యం మంత్రులు ముఖ్యమంత్రుల నుండి ప్రధానమంత్రి రాష్ట్రపతి వరకు రాకపోకలు సాగిస్తున్నప్పటికీ జీవో 111 నిబంధనల ఫలితంగా శంషాబాద్ ప్రాంతం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం శంషాబాద్ మున్సిపాలిటీని గ్రేటర్ హైదరాబాద్ లో విలీనం చేయడం శుభపరిణామం అన్నారు రాచమల్ల సురేష్. శంషాబాద్ మున్సిపాలిటీని గ్రేటర్ హైదరాబాద్ లో విలీనం చేయడం ద్వారా ఈ ప్రాంతం ఇప్పటికైనా అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శంషాబాద్ మున్సిపాలిటీ గ్రేటర్ హైదరాబాద్ లో విలీనం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోపాటు స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సురేష్ కృతజ్ఞతలు చెప్పారు. అదేవిధంగా శంషాబాద్ ప్రాంతం అభివృద్ధికి ఆటంకంగా మారిన జీవో 111 నిబంధనలను తక్షణమే ఎత్తివేయాలని, తద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా శంషాబాద్ ప్రాంతా అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని సురేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## మాజీ గ్రంథాలయ చైర్మన్ నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ పూజ కార్యక్రమానికి హాజరైన


- తెలంగాణ శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి





**నగర నిజం తాండూర్ ప్రతినిధి నవంబర్ 26:::** వికారాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయం చైర్మన్ ఎస్. రాజు గౌడ్ ఆహ్వానం మేరకు వారు నిర్మించిన నూతనంగా షాపింగ్ కాంప్లెక్స్ లో నిర్వహించిన పూజ కార్యక్రమానికి తెలంగాణ శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి హాజరై రాజు గౌడ్ కు శుభాకాంక్షలు తెలియజేసారు.. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర టీపీసీసీ ప్రచార సమన్వయకర్త కరణం పురుషోత్తం రావు, పంజుగుల విట్టల్ రెడ్డి అబ్దుల్ ఖవి, బీదర్ రాజశేఖర్, యువ నాయకులు బిర్కెట్ రఘు, శివానంద్, అగ్గనూర్ సంకేత్, అయ్యుబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు...

## శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయ నిర్మాణానికి రూ.1లక్ష రూపాయల విరాళం



**ఇబ్రహీంపట్నం, నవంబర్ 26 ( నగరనిజం ) :** ఇబ్రహీంపట్నం మండలం పోచారం గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ నిర్మాణానికి కర్ణంగూడ తాజా మాజీ సర్పంచ్ వంగేటి కవిత తిరుమల్ రెడ్డి రూ.1 లక్ష రూపాయల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ దాయి నరేష్ యాదవ్ మాట్లాడుతూ... ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసిన వంగేటీ కవిత తిరుమల్ రెడ్డి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు సుఖ,సంతోషాలను, అష్టైశ్వర్యాలను కలగజేయాలని కోరినట్లు తెలిపారు. ఆ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులు ఆ కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని కోరారు. ఆలయ పున:నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన వారికి ఆ నరసింహ స్వామి చల్లగా చూస్తాడని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ తరఫున వంగేటి కవిత తిరుమల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి





- పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలి
- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, నవంబర్ 26 ( నగరనిజం ) :** గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి ఆర్డీఓలు, ఎంపీడీఓలు, ఎంపీఓలతో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను జాగ్రత్తగా నిర్వర్తించాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందని, పరస్పరం సమన్వయంతో పని చేస్తూ ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, పోస్టర్లను, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల గోడలపై రాతలు ఉంటే తొలగించాలని ఆదేశించారు. ఏ దశలోనూ అలసత్వానికి తావు ఇవ్వకూడదని, ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు అనుక్షణం జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. నిఘా బృందాలను నియమించి, పకడ్బందీగా కోడ్ అమలు జరిగేలా పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను ఎక్కడికక్కడ నిరోధించాలని, మద్యం, డబ్బు పంపకాలు, ఇతర ప్రలోభాలకు గురి చేసే వస్తువుల పంపిణీపై నిఘా ఉంచాలన్నారు. ఓటరు జాబితాను మరోమారు నిశితంగా పరిశీలించాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లు గమనిస్తే తమ దృష్టికి తేవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమిస్తూ, ఎన్నికల విధుల పట్ల పరిపూర్ణ అవగాహన కల్పించేలా శిక్షణ తరగతులను ఇప్పటికే నిర్వహించడం జరిగిందన్నారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రిని జాగ్రత్తగా సరి చూసుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, ఎక్కడైనా సదుపాయాలు లేకపోతే యుద్ధప్రాతిపదికన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీరు, టాయిలెట్స్, ఫర్నీచర్, విద్యుత్, లైటింగ్ వంటి వసతులు ఉండేలా చూసుకోవాలని అన్నారు. సర్పంచ్, వార్డు స్థానాల రిజర్వేషన్ల జాబితాను మరోమారు పరిశీలించుకోవాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, కౌంటింగ్ తదితర అన్ని ప్రక్రియలను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికల నిర్వహణతో ముడిపడిన అంశాలపై, నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను గడువు లోపు పరిష్కరించాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్, నోడల్ అధికారులు, ఆర్డీఓలు, ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు.



# భారత ప్రజాస్వామ్యానికి పునాది -రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహణ






- బాలానగర్ సీఐ నర్సింహా రాజు ప్రధాన అతిథిగా పాల్గొన్నారు

**బాలానగర్ నవంబర్ 26 (నగర నిజం ప్రతినిధి):** భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాది వేసిందని, రాజ్యాంగ దినోత్సవాన్ని ప్రతి పౌరుడు గర్వంగా జరుపుకోవాలని బాలానగర్ సీఐ నర్సింహా రాజు అన్నారు. బాలానగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఎమ్ అరుణజ్యోతి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు రాజ్యాంగ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ముందుగా రాజ్యాంగ రూపకర్త డా. బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించిందని, అదే రోజు చారిత్రకంగా రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం భారతదేశానిదని, దీని రూపకల్పనలో అంబేద్కర్ అధ్యక్షతన ముసాయిదా కమిటీ 395 ఆర్టికల్స్, 22 భాగాలు, 12 షెడ్యూల్స్‌తో అద్భుతమైన రాజ్యాంగాన్ని రూపొందించిందని తెలిపారు.రాజ్యాంగం ప్రతీ భారతీయుడికి న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువలను నేర్పిందని సీఐ నర్సింహా రాజు నొక్కి చెప్పారు.సైబర్ నేరాలు, డ్రగ్స్ పై అవగాహనఇటీవల సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రస్తుతం జరిగే సైబర్ నేరాలలో 80 శాతం మొబైల్ ద్వారా జరుగుతున్నాయని తెలిపారు. తెలియని లింకులు, సందేశాలు లేదా కాల్స్ నమ్మరాదని, వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు .అలాగే యువత మాదకద్రవ్యాల వలలో పడకుండా ఉండి, ఇతరులను కూడా జాగృతం చేయాలని పిలుపునిచ్చారు. ఇంటర్నెట్ వాడకాన్ని పరిమితి లోపల ఉంచితేనే సురక్షితమైన డిజిటల్ జీవనం సాధ్యమవుతుందని చెప్పారు.కార్యక్రమంలో హెచ్ఎమ్ అరుణజ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 2వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని






**ఇబ్రహీంపట్నం, నవంబర్ 26 ( నగరనిజం ) :** 2వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలను రాష్ట్రంలో పకడ్బందీగా నిర్వహించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి అదనపు డిజిపి మహేష్ భగవత్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు - కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ... 2వ సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. రిజర్వేషన్లు, విడతల వివరాలు పోలింగ్ కేంద్రాలు, జియో లోకేషన్, టిఈపోల్ పోర్టల్ లో నమోదు చేయాలని, పోర్టల్ లో గ్రీవెన్స్ ఫ్లాట్ ఫామ్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. దరఖాస్తులు, ఫిర్యాదుల పరిష్కారానికి నోడల్ అధికారిని నియమించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ద్వారా తెలుపబడిన ఫిర్యాదులను 3 రోజులలోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు జరిగేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘనకు గురైనట్లయితే ఫిర్యాదులను స్వీకరించి త్వరగా పరిష్కరించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల జియో కోఆర్డినేటర్స్, మ్యాప్ వివరాలు టి ఈ పోల్ పోర్టల్ లో నమోదు చేయడం జరిగిందని, పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు అయిన వెలుతురు, ర్యాంపు, త్రాగునీరు, వెబ్ కాస్టింగ్, సి సి కెమెరాలు, సామాగ్రి ఇతర సదుపాయాలు కల్పించాలని తెలిపారు. పంపిణీ కేంద్రాలు మండల కేంద్రాలలోని ఏర్పాటు చేయాలని, ఫ్లయింగ్ సర్వేయలెన్స్ బృందం, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్ బృందం, వీడియో సర్వేయలెన్స్ బృందం, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ లను ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ లను కౌంటింగ్ కు 3 రోజుల ముందుగా సిద్ధం చేయాలని, పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. అదనపు డిజిపి మాట్లాడుతూ... పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బ్యాలెట్ బాక్సులు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, నగదు సీజ్ చేసే సమయంలో అన్ని వివరాలు క్షుణ్ణంగా పరిశీలించిన తరువాత సీజ్ చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణ మాట్లాడుతూ... రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం జిల్లాలో 2వ సాధారణ పంచాయితీ ఎన్నికలను అధికారుల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో 526 గ్రామ పంచాయతీలకు గాను 52 క్లస్టర్లుకు సంబంధించి మొదటి విడతలో కొత్తూరు, నందిగామ, కేశంపేట్, కొందుర్గ్, చౌదర గూడ, ఫారూక్ నగర్, శంషాబాద్ మండలాలలోని 174 సర్పంచ్, 1530 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 54 క్లస్టర్లుకు సంబంధించి 2వ విడతలో శంకర్ పల్లి, మొయినాబాద్, చేవెళ్ళ, షాబాద్, అమన్ గల్ కడ్తాల్ తలకొండపల్లి మండలాలలోని 178 సర్పంచ్, 1540 వార్డు సభ్యుల స్థానాలకు, 56 క్లస్టర్లుకు సంబంధించి 3వ విడతలో అబ్దుల్లాపూర్మెట్, ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల్, మాడ్గుల్, మహేశ్వరం, కందుకూర్ మండలాలలోని 174 సర్పంచ్, 1598 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఫ్లయింగ్, స్టాటిస్టిక్, వీడియో సర్వేయలెన్స్ బృందాలు, ఎంసిఎంసి, మీడియా సెల్, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ కృష్ణ రెడ్డి, డిపిఓ సురేష్ మోహన్, నోడల్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

Edited & printed and owner,publisher Yela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor Yela purushotham.(H.O) : plot no:31,H-No 1-13,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE